నా కు నచ్చిన నా కథ

# హత్య

నవీన్

గురవయ్య బొమ్మను తయారుచేశాడు. చాలా వికృతంగా తయారైంది. చిన్ని కళ్లు, పుల్లల్లాంటి పొడవైన చేతులు, కాళ్లు, పెద్ద బొజ్జ.

ఆ బొమ్మను చేతుల్లో పెట్టుకొని అటూ ఇటూ తిప్పి చూశాడు. తృప్తిగా నవ్వుకున్నాడు.

ఆ బొమ్మను గుడ్డలతో తయారుచేశాడు. మీద రంగు కాగితాలు అంటించాడు. తర్వాత తన డ్రాయరు సొరుగులో వున్న గుండుసూదులు తెచ్చి ఒక్కొక్క సూదినీ ఆ బొమ్మకు గుచ్చసాగాడు. ఆ పని చేస్తున్నంతసేపూ అతనికి బ్రహ్మానందం కలిగింది. "రోజూ నీ సూదుల్లాంటి తిట్లతో, మెమోలతో నన్నూ సరిగ్గా ఇలాగే హింసిస్తున్నావు కదూ? నేనేమీ చెయ్యలేననుకున్నావు గదూ? ఇదిగో చూడు"-అంటూ ఇంకో సూదిని ఆ బొమ్మకు గుచ్చాడు. తన దగ్గరున్న సూదులన్నీ అయిపోయేదాకా అతడలాగే చేశాడు.

తర్వాత ఆ బొమ్మను నేల మీద అటూ ఇటూ దొర్లించాడు. "అహహ్హహ్హ! బాధతో ఎలా కొట్టుకుంటున్నాడో చూడు గాడిద కొడుకు! బాగా అయింది! నన్ను రోజూ చంపుతున్నాడు, హింసిస్తున్నాడు. ఏడిపిస్తున్నాడు. రాచి రంపాన పెడ్తున్నాడు. ఈ రోజుతో నీకు మూడిందిరా! ఈ రోజు నిన్ను చంపేస్తాను! మామూలుగా చంపను, హింసించి హింసించి, చిత్రవధ చేసి మరీ చంపుతాను! నీ మీద ప్రతీకారం తీర్చుకోలేననుకుంటున్నావు గదూ?" ఇలా కొంత సేపు ఆ బొమ్మతో మాట్లాడాడు.

మళ్లా ఆ బొమ్మను నేల మీద అటూ ఇటూ దొర్లించాడు. కాళ్లతో తొక్కాడు, తన్నాడు. ఇలా కాస్సేపు చేసి ఆగిపోయాడు. ఆ బొమ్మ చెయ్యి పట్టుకొని నాడి చూస్తున్నట్లుగా నటించాడు. వెంటనే లేచి, "చచ్చాడు-మా ఆఫీసర్ చచ్చాడు! బాధకు తట్టుకోలేక ఠక్కున గుండె ఆగి చచ్చిపోయాడు! ఇప్పుడిక దహనం చెయ్యాలి" అన్నాడు.

బొమ్మ మీద కిరోసిన్ పోశాడు. ఇంటి వెనుక దొడ్లోకి తీసుకుపోయాడు. అక్కడ కొన్ని కట్టెపుల్లల్ని చితిలా తయారుచేశాడు. చితి మీద కూడా కిరోసిన్ కుమ్మరించాడు. బొమ్మను చితి మీద పడుకోబెట్టి అగ్గిపుల్ల గీసి అంటించాడు. గుప్పుమని పెద్ద మంట లేచింది. అతడా మంటకేసి తదేకంగా చూడసాగాడు.

అకస్మాత్తుగా గురవయ్య ఏడవటం మొదలెట్టాడు. "పాపం, మా ఆఫీసరు చచ్చిపోయాడు. నేనే చంపేశాను! రోజూ ఆఫీసులో నన్ను తిడ్తున్నాడనీ, పని చెయ్యటం చేతకాదని నానామాటలూ అంటున్నాడనీ నేనే చంపేశాను! పాపం, అతని పెళ్లాం, పిల్లలు ఎంత ఏడుస్తున్నారో!" ఆ మంట ఆరిపోయేదాకా గురవయ్య ఏడుస్తూనే వున్నాడు. తర్వాత వచ్చి పక్క మీద పడుకున్నాడు. అప్పుడు రాత్రి పన్నెండు గంటలవుతోంది. చాలా రోజుల తర్వాత అతనికి కంటి నిండా నిద్ర పట్టింది.

## 2

గురవయ్య ఆ ఊరి రెవిన్యూ ఆఫీసులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. గురవయ్య చిన్ననాటి నుంచీ వట్టి మొద్దబ్బాయిగా పేరు పొందాడు. ఎప్పుడూ నిద్రమత్తు మొహంతో తిరిగే అతనికి ఏ పని చేయటానికీ చేతనయ్యేది కాదు. అతడు పుట్టిన నాలుగైదు రోజులకే అతని తల్లి చనిపోయింది. పుట్టగానే తల్లిని చంపాడని అందరూ అతన్ని కసిరేవాళ్లు.

గురవయ్య తండ్రి వడ్రంగం చేసుకుంటూ బతికేవాడు. అతని సంపాదనకు ఏ పూటకు ఆ పూట గడవడమే కష్టంగా వుండేది. తన కొడుకును ఈ వృత్తిలోకి దింపే కంటే నాలుగు అక్షరాలు నేర్పించి ఏదన్నా ఉద్యోగంలో చేర్పించాలని అతడు కలలు కనేవాడు. కాని ఏడెనిమిది యేళ్లు వచ్చేదాకా గురవయ్యకు ఓనమాలే రాలేదు. బళ్లోకెళ్లి ఓ మూల పడుకొని చక్కగా నిద్ర పోయేవాడు. ఎన్నోసార్లు తండ్రి గురవయ్యను గొడ్డును బాదినట్టు బాదేవాడు. ఆ దెబ్బలకే తాళలేక 'మా నాన్న చచ్చిపోతే నాకీ దెబ్బలు తప్పేవి' అనుకునేవాడు గురవయ్య. గురవయ్యకు పదేళ్లు వచ్చేటప్పటికి-అతడు రెండో తరగతి చదువుతుండగా అతని తండ్రి -అకస్మాత్తుగా చనిపోయాడు. తండ్రి చనిపోయాడని తెలియగానే గురవయ్యకు మనసులో చాలా సంతోషం కలిగింది. 'నేను మనసులో మా నాన్న చనిపోవాలని కోరుకోవటం వల్లనే మా నాన్న చనిపోయా'డని గురవయ్య గట్టిగా నమ్మాడు.

గురవయ్యను వాళ్ల మేనమామ తన ఊరు తీసుకెళ్లి ఆ ఊరి స్కూల్లో చదివించాడు. ఒక్కొక్క క్లాసులోనూ రెండు మూడేళ్లు గడుపుతూ, గురవయ్య మొత్తానికి మెట్రిక్యులేషన్ అయ్యాననిపించాడు. గురవయ్య మేనమామే తంటాలు పడి అతనికి గుమాస్తా ఉద్యోగం సంపాదించి, ఆ తర్వాత తన కూతుర్నిచ్చి పెళ్లి చేశాడు.

గురవయ్య రోజూ ఆఫీసుకు వెళ్లి రావటం తప్ప అతడు ఆఫీసులో చేసే పనేమీ వుండేది కాదు. ఆఫీసుకు రాగానే టేబుల్ మీద తల పెట్టుకొని మీద ఫాన్ వేసుకొని, చక్కగా నిద్ర పోయేవాడు. టైమైందని ఎవరన్నా లేపితే లేచి ఇంటికొచ్చేవాడు. తన సెక్షన్‌కు సంబంధించిన ఫైల్లు కానీ, మరే ఇతరవివరాలు కానీ అతనికి తెలియవు. వాటితో అవసరమున్నప్పుడు అతని పక్కనున్న క్లర్క్ వచ్చి వాటిని చూసుకునేవాడు. గురవయ్య అదృష్టం బావుండి అతడు ఉద్యోగంలో చేరాక వచ్చిన ఇద్దరు ముగ్గురు ఆఫీసర్స్ చాలా మంచివాళ్లు. ఆఫీసులో ఏం జరుగుతోందని వాళ్లు పెద్దగా పట్టించుకునేవాళ్లు కాదు. తమ దగ్గరికొచ్చిన కాగితాల మీద టకాటకా సంతకాలు పెట్టేసి వాళ్లు వెళ్లిపోతుండేవాళ్లు. గురవయ్య

సెక్షన్ సూపరింటెండెంట్ మొదట్లో గురవయ్య నిద్రను పాడు చెయ్యటానికీ, అతనికి కొంచెం పని చెప్పటానికీ ప్రయత్నించేవాడు. కానీ గురవయ్య చేత పని చేయించడం స్టాలిన్లకూ, హిట్లర్లకూ కూడా సాధ్యం కాదని తెలుసుకొని ఆ ప్రయత్నం మానుకున్నాడు.

గురవయ్య కర్మం కాలి ఈ మధ్యనే కొత్త ఆఫీసర్ ఒకాయన వచ్చాడు. అతని పేరు కృష్ణమూర్తి. కృష్ణమూర్తి సామాన్యుడు కాడు. బండ చేత కూడా పని చేయించగల టాస్క్ మాస్టర్. అసమర్థతనూ, సోమరితనాన్నీ ఏ మాత్రం కూడా సహించేవాడు కాదు.

కృష్ణమూర్తిది భారీ విగ్రహం. ఆరడుగులకు పైగా పొడవుంటాడు. అంత పొడవుండటం వల్లనేమో చాలా సన్నగా కనిపించేవాడు. ఎదుటివాడిని నిశితంగా చూసే చిన్న కళ్లు. విశాలమైన నుదురు. ఎప్పుడూ సీరియస్‌గా వుండే మొహం -కృష్ణమూర్తిని చూడగానే ఆఫీసులో అంతా హడిలిపోయేవాళ్లు.

ఏ పనైనా చకచకా జరిగిపోవాలి -ఫైల్స్ వెంటవెంటనే కదలాలి. ఆఫీసుకు పని మీద వచ్చేవాళ్లు ఎక్కువ సేపు నిల్చోకూడదు. తన ఆఫీసులో అవినీతి, లంచగొండితనం, మొదలైనవి వుండటానికి వీల్లేదు-అని కృష్ణమూర్తి ఎంతో జాగ్రత్తగా పాటించే నియమాలు. అతను ఛార్జి తీసుకోగానే ఈ విషయాన్ని గురించి తన ఆఫీసులో పని చేసే వాళ్లందరికీ చెప్పాడు.

"మీరు ఎన్ని సౌకర్యాలు కావాలన్నా ఇస్తాను. కానీ చక్కగా పని చెయ్యండి. పనిని ఊరబెట్టకండి. తప్పించుకోకండి. క్విక్‌గా పని ముగించుకొని సరిగ్గా టైమ్‌కు వెళ్లిపొండి. మిమ్మల్ని ఓవర్ టైమ్ పని చెయ్యమని నేనెన్నడూ చెప్పను. ఐ లైక్ ఎఫిషియెన్సీ, కాని ఇన్ ఎఫీషియెన్సీని నేను సహించను! అసమర్థతనూ, సోమరితనాన్నీ ఈ



'హత్య' అనే ఈ కథను 1971లో రాశాను. నేను నల్గొండలో 1964 నుంచి 1970 వరకు అక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడుగా పని చేశాను. ఆ కళాశాల ఆఫీసులో ఒకతడు జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తుండేవాడు. అతన్ని ఎప్పుడు చూసినా అతని ముందున్న టేబుల్ మీద తల పెట్టి నిద్ర పోతుండేవాడు. తైలసంస్కారం లేక వరిగడ్డిలా రేగిన జుట్టుతో, నిద్రకళ్లతో, చాలా లేజీగా కనిపిస్తుండేవాడు. ఆఫీసులో పని చేసే మిగతావాళ్లెవరూ అతన్ని సీరియస్‌గా తీసుకునేవాళ్లు కారు. అతనికెక్కువ పని కూడా చెప్పేవాళ్లు కాదు. అతడు చెయ్యవలసిన పనుల్ని వేరే క్లర్కులు చేస్తుండేవాళ్లు. అప్పుడున్న ప్రిన్సిపాల్ చాలా ఈజీ గోయింగ్ టైపు. ఆఫీసులో పని చేసే సూపరింటెండెంట్‌నే పిలుస్తుండేవాడు తప్ప, వేరే వాళ్లనెవర్నీ పట్టించుకునేవాడు కాదు. అందువల్ల ఈ నిద్ర మత్తు జూనియర్ అసిస్టెంట్‌కు పెద్దగా సమస్యలేవీ ఎదురవుతుండేవి కావు. అతన్ని చూసినప్పుడల్లా నాకతడో విచిత్రవ్యక్తిలా కనిపించేవాడు. అతన్ని గురించి ఏదన్నా రాయాలనిపిస్తుండేది.

ఇలా వుండగా ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ట్రాన్స్‌ఫరై వేరే ప్రిన్సిపాల్ వచ్చాడు. కొత్తగా వచ్చిన ఈ ప్రిన్సిపాల్ గొప్ప టాస్క్ మాస్టర్. సోమరితనాన్ని ఏ మాత్రం సహించేవాడు కాదు. కాలేజీలో ఛార్జ్ తీసుకున్నదే తడవుగా ఆ కాలేజీలో పని చేస్తున్న అధ్యాపకుల్నీ, ఆఫీసు సిబ్బందినీ ఎప్పుడూ పరుగులు తీయించడం మొదలుపెట్టాడు. కాలేజీలో పని చేసే అందరి పేర్లనూ తెలుసుకుని, అందరినీ పేరుపేరునా పిలిచి పని చెప్తుండేవాడు. చెప్పిన పని చెయ్యకపోతే నానా చీవాట్లూ పెడుతుండేవాడు. ఇంత కాలం ఆఫీసులో ఏ పనీ చెయ్యకుండా హాయిగా నిద్ర పోతూ గడుపుతున్న నిద్ర కళ్ల జూనియర్ అసిస్టెంట్‌కు ఈ కొత్త ప్రిన్సిపాల్ రావడంతో, చాలా సమస్యలెదురయ్యాయి. అతడేమీ పని చెయ్యడనీ, ఎప్పుడూ నిద్ర పోతుంటాడనీ కొత్త ప్రిన్సిపాల్‌కు తెలిసిపోయింది. ఒక రోజు కొత్త ప్రిన్సిపాల్ ఆఫీసులో కొచ్చేటప్పటికి ఇతగాడు నిద్ర పోతూ కనిపించాడు. దాంతో ఆయన, అతన్ని ఓ పదిహేను నిమిషాలపాటు చీవాట్లు పెట్టాడు. అతనికి ఏ పని చెప్పినా చెయ్యలేడని తెలుసుకున్న ప్రిన్సిపాల్, అతన్ని డిస్పాచ్ సెక్షన్‌లో వడేశాడు. అక్కడ కూడా అతడు సరిగ్గా పని చెయ్యలేక ప్రతి రోజూ తిట్లు తినేవాడు. నేను కథలు రాస్తానని తెలుసుకున్న ఈ నిద్ర కళ్ల జూనియర్ అసిస్టెంట్ నాతో అప్పుడప్పుడూ తన సమస్యల్ని చెప్పుకుంటుండేవాడు. అతడు చెప్పిన విషయాల్ని నేను చాలా ఓపిగ్గా వింటూండేవాడిని. అతని కలాంటి పరిస్థితి అంత వరకూ తటస్థించలేదని కూడా చెప్పాడు. నేనతన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేవాడిని.

"ఈ కొత్త ప్రిన్సిపాల్ చచ్చిపోతే బావుండు సార్!" అన్నాడోసారి. అతనలా అన్న ఐదు రోజులకు ప్రిన్సిపాల్‌కు హార్ట్ అటాక్ వచ్చింది. "నా ఉసురే తగిలింది సార్!" అన్నాడతడు, ప్రిన్సిపాల్‌కు హార్ట్ అటాక్ వచ్చిందని తెలియగానే. తర్వాత మా ప్రిన్సిపాల్ కోలుకుని, నల్గొండ నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వేరే ఊరు వెళ్లిపోయాడు. ఇదీ జరిగింది. దీన్ని ఆధారం చేసుకుని నేను 'హత్య' కథ రాశాను.

ఒక వ్యక్తిలో విపరీతమైన ఆత్మన్యూనతాభావం ఏర్పడటం, దాంతో అతడు ఏ పనీ సక్రమంగా చెయ్యలేకపోవడం, అతనికి పని చెప్పినవాళ్లనూ, చీవాట్లు పెట్టినవాళ్లనూ ఏమీ చెయ్యలేక మనస్సులోనే వాళ్లను ద్వేషించటం-ఈ కథలో మనం గురవయ్యలో చూస్తాం. చేతబడి లాంటిది చేసి మనకు గిట్టనివాళ్లకు ఏదన్నా హాని కలిగేట్టు చెయ్యొచ్చుననే మూఢనమ్మకమొకటి మన సమాజంలో వుంది కాబట్టి, ఈ కథలోని గురవయ్యకు కూడా అలాంటి మూఢనమ్మకం వుంటుంది. ఓ బొమ్మను తయారుచేసి, ఆ బొమ్మను తన ఆఫీసరే అనుకుని, ఆ బొమ్మకు సూదులు గుచ్చుతూ, గొప్ప ఆనందాన్ని పొందుతాడు. ఆ బొమ్మ చనిపోయిందని తగలబెట్టేస్తాడు. తర్వాత వాళ్ల ఆఫీసర్ నిజంగానే చనిపోవడంతో, అతన్ని నిజంగానే చంపేశాననే అపరాధభావన అతనిలో కలుగుతుంది. క్రమక్రమంగా అతనిలో ఈ అపరాధభావన పెరిగి పెద్దదై అతన్ని పిచ్చివాణ్ని చేస్తుంది. భ్రమనే నిజమనుకునే స్థితికి చేరుకుంటాడు. అతని మాటలను చుట్టూవున్న వాళ్లెవరూ నమ్మరు. అతన్ని అర్థం చేసుకుని అతన్నో మానసికవైద్యుని దగ్గరికి తీసుకెళ్తే, అతని పరిస్థితి మెరుగవుతుందని ఎవరూ అనుకోరు. అతనిలోని అపరాధభావం పెరిగి అతన్ని పూర్తిగా ఆక్రమించుకుంటుంది. దాంతో అతడు హత్యకు పాల్పడతాడు.

నేరం చేసినవాడిని ఎవరూ శిక్షించవలసిన పని లేదు. అతని అంతరాత్మే అతన్ని శిక్షిస్తుంది. "ప్రతి వ్యక్తిలోనూ ఈ అంతరాత్మ అనే ఓ పోలీసువాడిని ప్రకృతి నియమించింది" అంటాడు సోమర్‌సెట్ మామ్. ఈ అంతరాత్మ కారణంగానే మనిషిలోని మంచితనం కాపాడుకోవచ్చు. "నేరం చేసినవాడిని ఎవరూ శిక్షించాల్సిన అవసరం లేదు, వాడి అంతరాత్మే వాడిని శిక్షిస్తుంది" అనే ఈ అంశాన్ని ఆధారం చేసుకునే దోస్టవిస్కీ 'క్రైమ్ అండ్ పనిష్మెంట్' అనే గొప్ప నవల రాశాడు.

తెలుగులో పాత్రల మనస్తత్వాన్ని లోతుగా చిత్రించే కథలు తక్కువగానే వెలువడ్డాయి. ఈ 'హత్య' కథలో ఓ వ్యక్తి అంతరాంతరాలను చిత్రించే ప్రయత్నం జరిగింది. ఈ కథ ఇంగ్లీషు, హిందీ, కన్నడభాషల్లోకి అనువదితమైంది. హిందీలో రాజేంద్ర అవస్తే సంపాదకత్వంలో వెలువడిన 'శ్రేష్ఠ్ భారతీయ కహానియాఁ' అనే సంకలనంలో ఈ కథనూ చేర్చుకున్నారు.

-రచయిత

ఆఫీసులో ఎక్కడా నేను చూడకూడదు!" అని కృష్ణమూర్తి ఒక మీటింగులో చెప్పాడు.

కృష్ణమూర్తి ఛార్జి తీసుకున్న క్షణం నుంచి ఆ ఆఫీసు స్వరూపమే మారిపోయింది. గాఢాంధకారంలో ఓ వెయ్యి కాండిల్ల ఎలక్ట్రిక్ బల్బు వెలిగినట్టయింది.

కృష్ణమూర్తి స్వయంగా ప్రతి క్లర్కునూ చూశాడు. ఇన్‌స్పైర్ చేశాడు. ప్రోత్సహించాడు. ప్రతివాడినీ ప్రభావితం చేసే ఒక గొప్పతనమేదో అతనిలో వుంది.

కృష్ణమూర్తి ఎంత టాస్క్ మాస్టరైనా హృదయం లేనివాడు మాత్రం కాదని ఆ ఆఫీసులో అందరూ అంగీకరించారు. అందరితోనూ అతడు ఆప్యాయంగా మాట్లాడేవాడు. వాళ్ల కష్టనిష్ఠురాలనూ, కుటుంబసమస్యలనూ తెలుసుకునేవాడు. సాధ్యమైనంత సహాయం చేసేవాడు. పనిలో లోపం జరిగితే మాత్రం క్షమించేవాడు కాదు.

## నిర్మాత అయిన ఐశ్వర్య

కొంత కాలం మోడల్‌గా వుండి జనాన్ని ఆకర్షించింది. ప్రపంచసుందరి అయ్యాక బాలీవుడ్‌లోకి ప్రవేశించి తన అందాలతో జనానికి కనువిందు చేసింది. మొదట్లో చెక్క మొహం అనిపించుకున్నా, ఇప్పుడు నంబర్ వన్ స్థానం పొందింది. మధ్యలో సల్మాన్ ఖాన్ ప్రేమాయణం ఒకటి పానకంలో పుడకలా వచ్చి పడి కొంత కాలం ఆ మైకంలో వుండి మేలుకుంది. ఇప్పుడు నిర్మాత కూడా అయింది ఐశ్వర్యారాయ్. 'దిల్ కా రిష్తా' అనే చిత్రంలో హీరోయిన్‌గా చేస్తూ దానికి నిర్మాతగా కూడా వ్యవహరిస్తుంది. మరి భవిష్యత్తులో ఇంకేమేం చేస్తుందో చూద్దాం.

ఎన్.



అతడెప్పుడూ సరిగ్గా టైముకు ఆఫీసుకు వచ్చేవాడు. టైమ్ కాగానే వెళ్లిపోయేవాడు. మధ్యలో ఎక్కడికీ వెళ్లేవాడు కాదు.

"ఈ రోజు కొత్త ఆఫీసర్ వస్తున్నాడు. ఈ రోజైనా నీ నిద్రను కాస్సేపు ఆపుకో"మని గురవయ్యకు అతని కొలీగ్స్ చెప్పినా అతనికి నిద్ర ఆగలేదు. గురవయ్య చక్కగా టేబుల్ మీద తల పెట్టుకొని ఫాన్ కింద నిద్రపోతూ కృష్ణమూర్తికి కనిపించాడు. కృష్ణమూర్తి ముఖం చిట్లించాడు. వెంటనే గురవయ్యను తన రూమ్‌కు పిలిపించాడు.

"మళ్లీ నాకు ఆఫీసులో నిద్ర పోతూ కనిపించావో, నువ్వింక ఈ ఆఫీసులో నిద్ర పోవలసిన అవసరం లేకుండా చేస్తాను-హాయిగా మీ ఇంట్లోనే నిద్ర పోవచ్చు!" అన్నాడు.

గురవయ్య నిద్రమత్తు మొహంలో చలనం లేదు.

"అంటే అర్థమైందా?" అన్నాడు కృష్ణమూర్తి.

'కాలేదు' అన్నట్టుగా తల తిప్పాడు గురవయ్య.

"అంటే తమకి ఊస్టింగ్ ఆర్డర్ చేతికిస్తా. సరే కానీ నీ సెక్షన్ ఫైల్సన్నీ తీసుకురా. నేనో సారి చూస్తాను" అన్నాడు కృష్ణమూర్తి.

గురవయ్య వణికిపోయాడు. తన దగ్గరున్న ఫైల్సేమిటో, అవి తన దగ్గర ఎందుకున్నాయో అతనికి తెలియదు-నిద్రలో నడిచివెళ్లినట్టుగా తన ఫైల్స్ దగ్గరికెళ్లి ఫైల్స్ తీసుకెళ్లి చూపెట్టాడు.

ఆ ఫైల్స్ స్వరూపం చూసి కృష్ణమూర్తి మండిపడ్డాడు. "నీకెవడయ్యా ఉద్యోగం ఇచ్చిందీ? నీ అంత పనికిమాలినవాణ్ని నా జన్మలో చూళ్లేదు. నీ వర్క్‌ను గురించి నీకు ఏబీసీడీలు కూడా తెలియనట్టుందే-ఈ సెక్షన్‌లో ఎలా వుంటున్నావయ్యా?"

కృష్ణమూర్తి వెంటనే సూపరింటెండెంట్‌ను పిలిచాడు. అతడు అసలు సంగతి చెప్పాడు.

"అవసరమున్నప్పుడల్లా అతని వర్క్ మేమే చూస్తున్నామండీ! అతనికేమీ తెలియదండీ!" అన్నాడు.

"ఇక నుంచి అలా జరగటానికి వీళ్లేదు. వెంటనే అతని సెక్షన్ మార్పించు, డిస్పాచ్ సెక్షన్‌లో కొంత కాలం ఏడవమను!" అన్నాడు కృష్ణమూర్తి.

గురవయ్యను డిస్పాచ్ సెక్షన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు.

ఏం జరిగినా గురవయ్యలో చలనం వుండదు. అతడు ఎవరితోనూ ఏమీ చెప్పుకోడు. అతనికా ఆఫీసులో ఫ్రెండ్సంటూ ఎవరూ లేరు. ఆ నిద్ర మత్తు మొహంలో ఎప్పుడూ ఎలాంటి మార్పూ కూడా కనిపించదు.

సెక్షన్ మారాక గురవయ్య కష్టాలు ఎక్కువయ్యాయి. గుట్టలకు గుట్టలు లెటర్స్ పడివుండటంతో వాటిని ఏ రోజు కారోజు డిస్పాచ్ చెయ్యటం అతనికి సాధ్యమయ్యేది కాదు. నాలుగు రోజుల కిందట వెళ్లాల్సిన ఉత్తరాలు ఈ రోజు వెళ్తుండేవి. ఒక రోజు కృష్ణమూర్తి డిస్పాచ్ సెక్షన్ కొచ్చి గుట్టలు గుట్టలుగా పడివున్న లెటర్స్ చూడనే చూశాడు.

గురవయ్యను బాగా తిట్టాడు. మళ్లీ ఇలా జరిగితే ఊస్టు చేస్తానన్నాడు. ఇంత అసమర్థుణ్ని తనెక్కడా చూళ్లేదన్నాడు.

గురవయ్య ఈ మధ్య నిద్ర పోవటం కొంచెం తగ్గించుకున్నాడు. కొంచెం చురుగ్గా వుండే ప్రయత్నం చేస్తున్నాడు. కానీ కట్టలు కట్టలుగా వస్తున్న అన్ని లెటర్స్‌ను ఏ రోజు కారోజు పంపించటమంటే అతనికి సాధ్యం కావటం లేదు.

మరో సారి కృష్ణమూర్తికి దొరికిపోయాడు. ఈ సారి కృష్ణమూర్తి ఏమీ మాట్లాడలేదు. వారం రోజుల పాటు గురవయ్యను సస్పెండ్ చేశాడు.

గురవయ్య మనసులో చిన్న సంచలనం ప్రారంభమైంది. చిన్నప్పుడు తన తండ్రి కొట్టిన దెబ్బలు జ్ఞాపకం వచ్చాయి. తన తండ్రిలాగే ఈ ఆఫీసర్ కూడా వెంటనే చనిపోతే బావుండును-అన్న కోరిక అతనిలో కలిగింది.

ఇలా వుండగా, మరో సంఘటన జరిగింది.

తమ జిల్లాలో ఆ సంవత్సరం వర్షాలు ఏ మాత్రం కూడా కురవని కారణంగా తల ఎత్తిన కరవు పరిస్థితులను గురించిన ఓ స్పెషల్ రిపోర్టు గవర్నమెంటుకు పంపించటానికి కృష్ణమూర్తి స్వయంగా తయారుచేశాడు. ఈ రిపోర్టు చాలా అర్జెంటుగా డిస్పాచ్ కావాలని స్పెషల్ నోట్ రాస్తూ డిస్పాచ్ సెక్షన్‌కు పంపించాడు. గురవయ్య అది గమనించలేదు. ఆ రిపోర్టు ఎక్కడో అడుగున పడిపోయింది-వారం రోజుల దాకా అది అట్లాగే పడి వుంది.

"మీ జిల్లాలోని కరవు పరిస్థితులను గురించి మాకింకా రిపోర్టు రాలేదు-వెంటనే

వంపించాల్సిం"దని పై నుంచి రిమైండర్ రావటంతో కృష్ణమూర్తి, వెంటనే గురవయ్యను పిలిపించి, "ఫలానా రిపోర్టు డిస్పాచ్ అయిందా?" అని అడిగాడు. తనకేమీ తెలియదన్నాడు గురవయ్య.

కృష్ణమూర్తి స్వయంగా వెళ్లి డిస్పాచ్ సెక్షన్‌లో వెతికితే ఏవో చెత్త కాగితాల్లో ఆ రిపోర్టు దొరికింది. కృష్ణమూర్తి ఆగ్రహానికి అంతు లేకపోయింది.

"రోగ్! ఇడియట్! ఇన్ ఎఫీషియెంట్ ఫూల్! నిన్ను వెంటనే డిస్మిస్ చేస్తున్నాను. పో! నీ నిద్ర మత్తు మొహాన్ని నాకు చూపించకు!" అంటూ నోటికొచ్చినట్లల్లా తిట్టాడు. గురవయ్య నోరు మెదపలేదు. ఈ సారి గురవయ్యను పదిహేను రోజుల పాటు సస్పెండ్ చేశాడు కృష్ణమూర్తి.

రోజు రోజుకూ గురవయ్యలో 'మా ఆఫీసర్ చనిపోతే బావుండును' అన్న భావం విజృంభించసాగింది. అతడు వెంటనే చనిపోకపోతే తనైనా వెంటనే అతన్ని చంపెయ్యాలి! కృష్ణమూర్తిని ఎలా హత్య చెయ్యాలో తన మనస్సులోనే చాలా పథకాలు వేస్తుండేవాడు. చివరకు అతనికో పథకం నచ్చింది. ఆచరణయోగ్యంగా కూడా కనిపించింది.

అదే ఈ రోజు అతను చేసింది. ఆఫీసర్ బొమ్మ నొకదాన్ని తయారుచెయ్యటం-ఆ బొమ్మను చిత్రవధ చేసి చంపెయ్యటం-ఆ బొమ్మకు అంత్యక్రియలు చెయ్యటం-అదీ అతనికి నచ్చిన పథకం-ఈ రోజు సరిగ్గా ఆ పథకం ప్రకారమే అతడా బొమ్మను తగులబెట్టాడు.

అతనికి గుండె ఎంతో తేలిక పడ్డట్టు అనిపించింది. ఈ మధ్య చాలా రోజులుగా అతనికి సరిగ్గా నిద్ర పట్టటం లేదు. కానీ ఈ రోజున మాత్రం అతనికి చక్కగా నిద్ర పట్టింది. అతనికో కల కూడా వచ్చింది.

అతన్ని పోలీసులు అరెస్టు చేసి జైలుకు తీసుకెళ్లారు. "కృష్ణమూర్తిని చంపింది నువ్వే కదూ?" అని అడిగారు.

"ఔను, నేనే" అని తను నిజం చెప్పేశాడు.

తనను కోర్టుకు కూడా తీసుకెళ్లారు. జడ్జిగారు కూడా "కృష్ణమూర్తిని చంపింది నువ్వేనా?" అని అడిగారు. "నేనే" అని చెప్పాడు. జడ్జి తనకు ఉరిశిక్ష విధిస్తున్నట్టు తీర్పు చెప్పాడు.

3

ఆ తెల్లారి ఆఫీసుకు వెళ్లాలంటే గురవయ్యకు భయమేసింది. తనను పోలీసులు పట్టుకుంటారేమో, జైల్లో వేస్తారేమో? కానీ అప్పుడే ఈ విషయం ఎవరికీ తెలిసుండదులే అనుకున్నాడు.

నెమ్మదిగా ఆఫీసుకు చేరుకున్నాడు.

సరిగ్గా పదిన్నరకు కృష్ణమూర్తి ఆఫీసుకు వచ్చాడు. గురవయ్యకు తను చూస్తున్నది అసలు కృష్ణమూర్తిని కాదు-కృష్ణమూర్తి దయ్యం రూపంలో ఇలా వచ్చాడనిపించింది. తనకు తెలిసినంతవరకూ రాత్రే కృష్ణమూర్తిని హత్య చేసేశాడు.

తన పని చూసుకోవటం మొదలెట్టాడు.

ఇంతలో ఆఫీసులో పెద్ద కలకలం వినిపించింది.

"ఏమైంది? ఏమైంది?" అని గురవయ్య ఓ ప్యూన్‌ను అడిగాడు.

"ఆఫీసర్ గారికి గుండె పోటు వచ్చిందట సార్!" అన్నాడతడు.

గురవయ్య నెమ్మదిగా కదిలాడు. అందరూ ఆఫీసర్ రూమ్‌కు పరిగెత్తుతున్నారు. ఆ రూమ్ జనంతో క్రిక్కిరిసిపోయింది. గురవయ్య కూడా అక్కడికి చేరుకున్నాడు.

ఆఫీసర్ కృష్ణమూర్తి విపరీతంగా బాధ పడిపోతున్నాడు. అతన్ని ఎవరో సూదులతో గుచ్చుతున్నట్టుగా విలవిల్లాడిపోతున్నాడు.

గురవయ్య కళ్లు తృప్తిగా వెలిగాయి. ఈ దృశ్యం తను ఇదివరకే చూసినట్టుగా, జరగాల్సిందే జరుగుతున్నట్లుగా మనస్సులో సంతోషించాడు.

ఇంతలో డాక్టరొచ్చాడు. డాక్టర్, కృష్ణమూర్తిని పరీక్ష చేసి "వీరిని వెంటనే హాస్పిటల్‌కు చేర్చాలి" అన్నాడు. కానీ కృష్ణమూర్తిని హాస్పిటల్‌కు చేర్చేలోపలే అతడు ఆఖరి శ్వాస విడిచాడు. అతని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

ఆఫీసులో అందరూ పసిపిల్లల్లా ఏడవటం మొదలుపెట్టారు. ఆఫీసంతా తండ్రి లేని పసివాడిలా రోదించింది.

గురవయ్యలో మాత్రం చలనం లేదు. ఓ బండరాయిలోనైనా కొంచెం తడి వుంటుందేమో గానీ, అతని కన్నుల్లో మాత్రం తడి లేదు.

ఇంకో అనుమానం తలెత్తింది. వీళ్లకెవళ్లకూ తనే ఆఫీసర్‌ను చంపినట్లుగా ఇంకా తెలీదు. తెలిస్తే తనను ఇక్కడికిక్కడే చిత్రవధ చేసేస్తారేమో అనిపించింది.

కృష్ణమూర్తి శవాన్ని ఓ కార్లోకి ఎక్కించి వాళ్ల ఇంటికి పంపించారు. ఆఫీసు మూసేసి అందరూ వాళ్ల ఇంటికి కారు వెనకాలే పరుగెత్తారు. గురవయ్య కూడా వాళ్లతో బయలుదేరాడు.

కృష్ణమూర్తి భార్య ఈ వార్త వినగానే మూర్ఛపడిపోయింది. అతని ముగ్గురు కొడుకులు, ఇద్దరు బిడ్డలు తండ్రి మీద పడి గుండెలు పగిలేలా ఏడవసాగారు.


కృష్ణమూర్తి భార్యకు ముప్పై ఏళ్లుంటాయేమో, కానీ చాలా చిన్న వయసున్నదానిలా అనిపించింది. చాలా అందంగా కూడా వుంది. ఆమె మూర్ఛ నుంచి తేరుకున్నాక, హృదయవిదారకంగా ఏడ్చింది. గురవయ్య ఏడుస్తున్న కృష్ణమూర్తి పిల్లలనూ, భార్యనూ చూశాడు. కృష్ణమూర్తిని అందరూ మంచివాడనీ, సమర్థుడనీ పొగుడుతారు. నిజానికతడు మంచివాడే. తనకు పని చెయ్యటం చేత కాదు. కాబట్టే తనను శిక్షించాడు. అంత మాత్రాన తను అతన్ని హత్య చేయాలా?

అందరితోపాటే గురవయ్య ఆ రోజంతా కృష్ణమూర్తి ఇంట్లోనే వున్నాడు. అతని దహనకాండలన్నీ చూశాడు. రాత్రి బాగా పొద్దు పోయాక ఇల్లు చేరాడు.

4

ఇవ్వాళో రేపో, తన కోసం వస్తారని గురవయ్య ఎదురుచూడసాగాడు. తలుపు కిర్రుమన్నా, బయట బూట్ల చప్పుడైనా, జీపు చప్పుడైనా విపరీతంగా వణికిపోయేవాడు.

'అదిగో వస్తున్నారు... తనను అరెస్టు చేస్తారు. ఉరి తీస్తారు. తనెక్కడికైనా పారిపోవాలా? లేదు. పారిపోయినా లాభం లేదు. తను ఎక్కడున్నా



## గ్లామరస్ లిప్స్

మహిళల అందాలకు అంతర్జాతీయమైన లుక్ ఇచ్చేందుకు మేబీలిన్ సంస్థ వారు వెట్ షైన్ డైమండ్ రేంజ్‌ను బజార్లోకి తీసుకువచ్చారు. ప్లమ్ సాలిటైర్, పింక్ డైమండ్, మోవీరాక్ వంటి ఆకర్షణీయమైన షేడ్లలో లభించే మేబీలిన్ వెట్ షైన్ డైమండ్ లిప్ స్టిక్‌లను పరిచయం చేస్తున్నారు. వీటితో పెదవులకు స్పార్క్‌లింగ్ షైనింగ్ కలుగుతుంది. వీటి ధర రు.199/-లు మాత్రమే.

ఎస్.

తనను పోలీసులు వేటాడుతారు. పట్టుకుంటారు, ఉరి తీస్తారు... తప్పదు! తను చనిపోతే తన కోసం ఏడ్చేవాళ్లెవరూ లేరు. తనను తన భార్య ఏ నాడో వదిలేసింది. తన లాంటి ఎందుకూ కొరగానివాడితో వేగలేనని నానాబూతులూ తిట్టి తన దారిన తాను వెళ్లిపోయింది. ఈ మధ్యనే ఎవడితోనో లేచిపోయిందట. తనకు పిల్లలూ, జెల్లలూ ఎవరూ లేరు. తనను ఉరి తీస్తే, తను చనిపోతే తన కోసం, కృష్ణమూర్తి కోసం ఏడ్చినట్లుగా ఎవరూ ఏడ్వరు.

'పాపం కృష్ణమూర్తి! కృష్ణమూర్తి పదికాలాల పాటు బతకాల్సిన వాడు. అతన్ని ఎంతోమంది ప్రేమించారు. అతని మీద ఆధారపడి బతుకుతున్న ఓ పెద్ద కుటుంబం దిక్కు లేనిదై పోయింది. అంత చిన్న వయసులోనే అతని భార్యకు వైధవ్యం ప్రాప్తించింది. అతను చాలా ఘోరమే చేశాడు. తను చస్తే లోకానికేమీ నష్టం లేదు. కానీ కృష్ణమూర్తి లాంటి వాడు చనిపోవటం వల్ల లోకానికి చాలా నష్టమే వాటిల్లింది. తను క్షమించరాని నేరం చేశాడు.'

ఎప్పుడూ నిద్ర పోయే గురవయ్యకు రాత్రులు కూడా నిద్ర పట్టటం మానేసింది. ప్రతి క్షణం ఏదో జరుగుతుందని ఎదురుచూడసాగాడు. చీమ చిటుక్కుమన్నా లేచి కూర్చునేవాడు. తలుపు కిర్రుమన్నా, కిటికీ తలుపులు కొట్టుకున్నా, రోడ్డు మీద జీపు చప్పుడైనా లేక పక్కింట్లో అడుగుల చప్పుడైనా 'అదిగో వస్తున్నారు... తను వెళ్లాలి!' అనుకుంటూ బట్టలేసుకుని తయారుగా వుండేవాడు. ఎంతకూ ఎవరూ రాకపోవటంతో విసిగిపోయేవాడు. లేదు... వాళ్లకింకా తెలియలేదు. పోలీసువాళ్లు వట్టి చేతకానివాళ్లు! ఇంత చిన్న విషయం తెలుసుకోటానికి వీళ్ల కింత టైమ్ పడుతుందా? అనుకున్నాడు.

ఎంతో కష్టం మీద ఎన్నోసార్లు పక్క మీద అటూ ఇటూ దొర్లాక, అతనికి కాస్సేపు కునుకు పట్టేది. వెంటనే అతనికి భయంకరమైన కలలొచ్చేవి. కృష్ణమూర్తి, పోలీసులు, న్యాయస్థానాలు, లాయర్లు, ఉరి తాడు, ఉరి తీసేవాళ్లు-అతనికి వివిధరూపాల్లో కనిపించేవాళ్లు. అతను వెంటనే లేచి కూర్చునేవాడు.

వారం రోజులు గడిచాయి.

గురవయ్య రోజురోజుకూ క్రుంగి, కృశించిపోసాగాడు. అతనికి అన్నం రుచించటం లేదు. నిద్ర పట్టటం లేదు. ఏమీ చెయ్యాలనిపించటం లేదు.

ఓ రోజు ఆఫీసులో తన పక్కనే కూర్చొనే క్లర్కు సత్యనారాయణతో గురవయ్య అన్నాడు-"మీకో రహస్యం చెప్పాలి. కాస్సేపు బయటకొస్తారా?"

సత్యనారాయణ, గురవయ్యకేసి వింతగా చూశాడు. రెండేళ్లుగా తన పక్కనే కూర్చుని పని చేస్తున్నా, తనతో ఏ నాడూ మాట్లాడని గురవయ్య, ఈ రోజు తనకో రహస్యం చెబుతానని పిలవడం అతన్ని నిజంగా ఆశ్చర్యపరిచింది.

"పదండి" అంటూ సత్యనారాయణ లేచాడు.

ఇద్దరూ ఆఫీసు కాంటీన్‌లో ఓ మూల కూర్చున్నారు. కాంటీన్‌లో ఆ టైమ్‌లో ఎవరూ వుండరు రెండు టీలు ఆర్డరిచ్చి "చెప్పండి" అన్నాడు సత్యనారాయణ.

గురవయ్య విపరీతంగా వణకటం మొదలెట్టాడు. చాలా రోజులుగా నిద్ర లేక, అతని కళ్లు లోపలికి పీక్కుపోయాయి. తైలసంస్కారం లేకుండా తలంతా రేగి అసహ్యంగా వుంది. మొదలే నల్లగా కమిలిన ముఖంలో, లావు పెదాలతో వికారంగా వుండే గురవయ్య, ఇంకా వికారంగా, భయంకరంగా కనిపించాడు. సత్యనారాయణ చెయ్యి పట్టుకుంటూ గుసగుసగా అన్నాడు-"మన ఆఫీసర్ కృష్ణమూర్తిని నేనే చంపాను సార్! హత్య చేశాను!"

క్షణం సేపు సత్యనారాయణ గురవయ్యకేసి నోరు తెరుచుకుని చూశాడు. గురవయ్య అంటున్నదేమిటో అతనికి వెంటనే బోధ పడలేదు.

"మీరు నమ్మటం లేదు కదూ? నిజం, మన ఆఫీసర్‌ను నేనే చంపేశాను. ఈ విషయం ఎవరికీ తెలియదు. చాలా రహస్యంగా చేసేశాను. పోలీసులక్కూడా ఇంకా తెలియదు"


"మిస్టర్ గురవయ్యా! మీకు పిచ్చెక్కలేదు గదా? మీరు ఏం మాట్లాడుతున్నారో మీకు తెలుసా?" అన్నాడు సత్యనారాయణ.

"నాకు పిచ్చెక్కటం ఏమిటి? మీకెందుకొచ్చిందా సందేహం?" అన్నాడు గురవయ్య.

"మన ఆఫీసర్‌ను ఎవరూ చంపలేదు. గుండె పోటుతో అతనే సహజంగా చనిపోయాడు. అతడు చాలాకాలంగా గుండెపోటుతో బాధ పడుతున్నాడు. నువ్వు చంపటమేమిటి, నాన్సెన్స్! నాతో అన్నావు గానీ, ఇంకెవరితోనూ అనకు. నిన్ను మెంటల్ హాస్పిటల్లో అడ్మిట్ చేస్తారు-జాగ్రత్త!" అంటూ టీ తాగటం ముగించి సత్యనారాయణ వెళ్లిపోయాడు.

గురవయ్య అలాగే చాలా సేపు కూర్చున్నాడు. పూర్ ఫెలో సత్యనారాయణ! అందరిలాగే అతనూ మోసపోయాడు. ఆఫీసర్ గుండెపోటుతో చనిపోయాడని నమ్ముతున్నాడు. పిచ్చివాడు! అంతా పిచ్చివాళ్లే-తన మాట ఎవరూ నమ్మటం లేదు.

గురవయ్యలో ఉద్భవించిన అశాంతి అంతకంతకూ దావానలంలా ప్రజ్వరిల్లి అతన్ని దహించివేయసాగింది. అతని గుండెలో ఎవరో నిరంతరం వేయి సూదులతో గుచ్చుతున్నంత బాధ-అతని మస్తిష్కంలో లక్ష అగ్నిపర్వతాలు బద్దలవుతున్నంత గందరగోళం-కళ్లు మూసుకుంటే



## కళ్లు లేకపోతేనేం?

అయినా పరవాలేదంటున్నారు ముంబయి విద్యార్థినులు. ప్రకృతిసిద్ధంగా వుండవలసిన దృష్టి లేకపోయినప్పటికీ వారు, బాగా చదువుకుని పదవతరగతి పరీక్షలు చక్కగా రాసి, ఫస్ట్ క్లాసులు తెచ్చుకున్నారు. మామూలుగా వున్నవారి కన్నా తామేమీ తీసిపోమని నిరూపించుకున్నారు. దాదర్-ముంబయిలోని కమలామెహతా అంధవిద్యాలయంలో ఏడవతరగతి వరకూ వుంది. ఇక్కడి నుంచి పై చదువుకు అమ్మాయిలు నాయ్‌గాంవ్‌లోని సరస్వతీ హై స్కూల్‌కు వెళతారు. గత ఐదేళ్లుగా ఇక్కడి విద్యార్థినులు మామూలు విద్యార్థుల కన్నా బాగా చదువుకుంటూ, మంచి మార్కులతో ఉత్తీర్ణలవుతున్నారు. ఇందుకు కారణం వారిని ఎటువంటి ఆకర్షణలూ లొంగదీసుకోకపోవటమే నంటున్నారు స్కూల్ ప్రిన్సిపాల్. టీవీ చూడకపోవటం ముఖ్యమైన ప్లస్ పాయింట్ అంటున్నారామె.

ఎస్.

అతనికి ఉరి తాడు... కోటి రూపాలతో, కోటి రంగులతో కనిపించసాగింది. తిండీ, నీళ్లూ, నిద్రా అతని దరిదాపులకు రాలేకపోయాయి. ఏదో జరుగుతుంది-ఎవరో వస్తారు-తననెక్కడికో తీసుకుపోతారు. తనను బాధ నుంచి శాశ్వతంగా విముక్తుణ్ని చేస్తారని ఎదురుచూసి ఎదురుచూసి అతని సర్వశక్తులూ హరించిపోయాయి.

పదిహేను రోజులు గడిచాయి. ఓ రోజు అర్థరాత్రి అకస్మాత్తుగా పక్క మీది నుంచి లేచి నిద్రలో నడిచిపోతున్నట్లుగా నడుస్తూ గురవయ్య పోలీస్ స్టేషన్ చేరుకున్నాడు.

"ఏం కావాలండీ?" అన్నాడు డ్యూటీలో వున్న కానిస్టేబుల్.

"ఎస్ఐతో మాట్లాడాలి" అన్నాడు గురవయ్య.

కానిస్టేబుల్ గురవయ్యను ఎస్ఐ దగ్గరికి తీసుకెళ్లాడు.

ఎవరితోనో మాట్లాడి అప్పుడే ఫోన్ పెట్టేస్తున్న ఎస్ఐతో, "ఈయనెవరో మీతో మాట్లాడాలిట సార్!" అని చెప్పి కానిస్టేబుల్ వెళ్లిపోయాడు.

"చెప్పండి" అన్నాడు ఎస్ఐ గురవయ్యను ఎగాదిగా చూస్తూ.

గురవయ్య రూపం చాలా భయంకరంగా వుంది. కళ్లు చింతనిప్పుల్లా వున్నాయి. జుట్టంతా చిందరవందరగా రేగి వుంది. మనిషి ఏ క్షణంలోనైనా కింద పడిపోతాడన్నట్టుగా వున్నాడు.

"మీరైనా నేను చెప్పేది నమ్మాలి సార్. మీరు కూడా అందరిలా నవ్వేసి నన్నో పిచ్చివాడి కింద జమ కట్టకండి సార్" అన్నాడు గురవయ్య, సబ్ ఇన్స్పెక్టర్ చేతులు పట్టుకుంటూ.

అతన్ని కుర్చీలో కూర్చోబెడ్తూ, "ఏమిటో చెప్పవయ్యా మొదట!" అన్నాడు ఎస్ఐ.

"నేనో వ్యక్తిని హత్య చేశాను సార్. మీరు వెంటనే నన్ను అరెస్టు చెయ్యకపోతే నేను బతకలేను!"

సబ్ ఇన్స్పెక్టర్ కళ్లకు పట్టిన నిద్ర మత్తు వదిలిపోయింది. అతను కుర్చీలో సరిగ్గా కూర్చుంటూ, "ఏమిటీ? మళ్లీ చెప్పు!" అన్నాడు.

"నేను... నేను... మా ఆఫీసర్ కృష్ణమూర్తిని చంపేశాను సార్! ఇంత కాలం దొరక్కుండా తప్పించుకున్నాను. కానీ నా అంతట నేనే పోలీసులకు లొంగిపోవటం మంచిదని ఇలా వచ్చేశాను సార్!" అన్నాడు గురవయ్య.

"ఎక్కడ జరిగిందా హత్య?"

"ఇక్కడో సార్... ఈ ఊళ్లోనే..."

"ఈ మధ్య ఈ ఊళ్లో హత్యలేవీ జరగలేదే?!"

"జరక్కపోవటమేమిటి? పదిహేను రోజుల క్రితం రెవిన్యూ ఆఫీసర్ కృష్ణమూర్తిని నేను హత్య చేయలేదూ?"

"రెవిన్యూ ఆఫీసర్ కృష్ణమూర్తా? అతను హార్ట్ అటాక్‌తో చనిపోయడు గదయ్యా?"

"అక్కడే సార్, మీరూ పొరపడుతున్నారు. అతన్ని నేను నా చేతులతో చంపేశాను. అతని మీద కిరోసిన్ పోసి అగ్గి పుల్ల గీసి అంటించాను... పాపం... చాలా ఘోరమైన చావు చచ్చాడు లెండి! ఈ విషయం ఎవరికీ తెలియదు. అంతా అతడు హార్ట్ అటాక్‌తో చనిపోయాడనుకుంటున్నారు. మీరు కూడా ఓ పోలీసు ఆఫీసరయ్యుండి ఈ మాత్రం తెలుసుకోలేకపోతే ఎలా సార్?"

"ఏయ్ మిస్టర్! నువ్వేం చేస్తున్నావు? వాటీజ్ యువర్ ప్రొఫెషన్?"

"రెవిన్యూ ఆఫీసులో క్లర్కుగా..."

"బట్ ఆర్ యూ మెంటల్లీ ఆల్ రైట్? నీ బుర్ర సరిగ్గా పని చేస్తున్నదా? అని... లేక ఇదంతా ఫన్ కోసమా?"

"అదేమిటి సార్, అలా అంటారు?"


"నువ్వు మళ్లీ అలాగే వాగావంటే నిన్ను వెంటనే పిచ్చాసుపత్రిలో అడ్మిట్ చేయిస్తాను... జాగ్రత్త! ఇదేమన్నా పోలీసు స్టేషన్ అనుకున్నావా, లేక నీ ఇల్లనుకున్నావా? మమ్మల్ని ఫూల్స్ చేద్దామని ప్రయత్నిస్తున్నావా ఏం? ఇక నువ్వు వెళ్లొచ్చు. ఏయ్ ఫోర్ నాట్ త్రీ! ఈ పెద్దమనిషిని బయటికి పంపించు!" అన్నాడు ఎస్ఐ.

గురవయ్య పోలీస్ స్టేషన్ బయటికొచ్చాడు.

000

రెండు మూడు రోజుల తర్వాత ఇదే సబ్ ఇన్స్పెక్టర్ తన ఇంట్లో ఉరేసుకుని చనిపోయిన గురవయ్య శవాన్ని చూసి షాక్ తిన్నాడు. గురవయ్య చెప్పిన విషయాన్ని కొంచెం సీరియస్‌గా తీసుకుని, అతన్నో కంట కనిపెట్టి వుంటే, ఈ ప్రమాదం జరిగివుండేది కాదేమో ననుకున్నారు, గురవయ్య కొలీగ్ సత్యనారాయణా, ఆ సబ్ ఇన్స్పెక్టర్!

■



## గర్భనిరోధానికి 'పాచ్'

ఇప్పటి వరకూ గర్భనిరోధకమాత్రలు, ఇంజక్షన్లు వున్నాయని అందరికీ తెలుసు. కానీ మాత్రలతో కలిగే సైడ్ ఇఫెక్ట్స్ వల్ల మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఆ ఇబ్బందులను తొలగించాలని, విదేశాల్లో కొత్త రకం గర్భనిరోధకసాధనమైన 'పాచ్'ను తయారుచేశారు. వీటిని వాడుకుని పిల్లలు పుట్టకుండా జాగ్రత్త పడొచ్చు. చర్మంలా మృదువుగానూ, కాగితంలా పలుచగానూ వుండే ఈ పాచ్ పేరు ఓర్థో ఇవ్రా పాచ్. ఈస్ట్రోజన్, ప్రొస్టేజన్ హార్మోనులున్న ఈ పాచ్‌ను భుజాలు, ఉదరం, వీపు, నితంబాల మీద, ఎక్కడ కావాలంటే అక్కడ పెట్టుకోవచ్చు. కానీ వారానికి ఒక సారి ఈ పాచ్‌ను మార్చాలి. మూడు వారాల వరకూ దీన్ని వాడుకోవాలి. నాలుగో వారం సేఫ్ పీరియడ్ కనుక పాచ్‌తో అవసరం వుండదు. ప్రపంచంలోనే మొట్టమొదటి సారి ఇటువంటి పాచ్ రూపంలో గర్భనిరోధకసాధనం లభ్యమవుతున్నది. ఇప్పుడు గర్భనిరోధానికి వాడుతున్న మాత్రలెలా పని చేస్తున్నాయో, అట్లాగే ఈ పాచ్ కూడా విజయవంతంగా పని చేస్తుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఎస్.